సాక్షి
కాకినాడ

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



అలరించిన చోర సంవాదం

అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన చోర సంవాద ఘట్టం భక్తులను అలరించింది.


8లో



రూ.2,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి హరికృష్ణ, దీప్తి సుశ్రిత్ కృష్ణ (విజయవాడ) రూ.లక్ష, వేంకటరావు, దీప (చెన్నై) రూ.1,00,116 చొప్పున మంగళవారం విరాళాలు సమర్పించారు.

8,850 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.85 అడుగులకు చేరింది.

బీడువరితున్న రబీ

- గోదావరి డెల్టా ఆయకట్టులో నీటికి కటకట
- రెండు జిల్లాల్లో 4.50 లక్షల ఎకరాల్లో రబీ సాగు
- డెల్టా కాలువలకు 8,850 క్యూసెక్కుల పంపిణీ
- శివారు... మెరకలకు అందని నీరు
- సాగునీటి యాజమాన్యం అస్తవ్యస్తం



కాకినాడ జిల్లా కరపలో ఎండిపోతున్న వరిచేలు



కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు -2 లాకు వద్ద ఎండిపోయిన ప్రధాన పంట కాలువ

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టాలో రబీకి కష్టకాలం మొదలైంది. డెల్టా శివారు.. మెరక ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొంది. నీరందక పంట చేలు నెర్రెలు తీస్తున్నాయి. డెల్టా కాలువలకు అవసరానికి సరిపడా నీరు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా, అధ్వానంగా ఉన్న పంట కాలువల వ్యవస్థ... అస్తవ్యస్తంగా మారిన నీటి యాజమాన్యం వల్ల చేలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

ఖరీఫ్ సాగులో దెబ్బతిన్న రైతులు కోటి ఆశలతో రబీకి శ్రీకారం చుట్టారు. నీటి ధోకా లేదని చెబుతూ వచ్చిన సాగు నీటిపారుదల శాఖ అధికారులు కీలక సమయంలో చేతులు ఎత్తేశారు. నాట్లు వేసిన చోట్ల వరిచేలు దుబ్బులు చేస్తున్నాయి. మరోవైపు వేసవి ఎండలు పెరగడంతో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటుతున్నాయి. ఈ సమయంలో చేలకు సమృద్ధిగా నీరందించాల్సి ఉంది. కాని రైతులు అరకొర నీటితో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. తూర్పు డెల్టా పరిధిలో కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల్లో శివారుల్లో నీటి ఎద్దడి తప్పడం లేదు. పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) పరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట మండలాల్లో అరకొర సాగునీటితో రైతులు నెట్టుకొస్తున్నారు. మధ్యడెల్టాలో ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి వంటి శివారు మండలాల్లో ఎద్దడి అధికంగా ఉంది. ఇక్కడ ప్రధాన పంట కాలువలకు అనుబంధంగా ఉన్న చానల్స్, పంట బోదెల్లోనే సాగునీరు ఉండడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 2,650 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున మొత్తం మొత్తం 8,850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు, సహజ జలాలు, ఇప్పుడు విడుదల చేస్తున్న నీటితో పెద్దగా ఎద్దడి రాకూడదు. పైగా లాకుల వారీగా వారాబందీ (వంతుల వారీ విధానం) అమలు చేస్తున్నారు. ఈ కారణంగా ఎద్దడి ఎదుర్కొనాల్సిన అవసరం లేదు. కానీ చేలు ఎండిపోయేలా పరిస్థితి ఉన్నా నీరందడం లేదు.

అధ్వానంగా పంట కాలువలు... అస్తవ్యస్తంగా నీటి యాజమాన్యం

డెల్టా పంట కాలువ వ్యవస్థ ఆధ్వానంగా మారింది. రబీకి ముందు చేయాల్సిన షార్ట్ టర్మ్ క్లోజర్ పనులు చేయలేదు. కనీసం పంట కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క తొలగించలేదు. ప్రధాన పంట కాలువలతోపాటు చానల్స్, పంట బోదెల్లో గుర్రపుడెక్క అల్లుకుపోయింది. లాకుల వద్ద, డైరెక్ట్ పైపులు (డీపీ) వద్ద ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు నిండిపోయాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అరకొర నిధులతో కూడా పనులు చేయలేదు. దీనివల్ల కాలువలకు నీరందిస్తున్నా శివారుకు చేరడం లేదు. వంతుల వారీ విధానం అమలు చేస్తున్నా ఆయకట్టు రైతులకు ముందస్తు సమాచారం అందించడం లేదు. ఇది కూడా నీరందకపోవడానికి ఒక కారణమవుతోంది. మరీ ముఖ్యంగా మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్‌లు వేయాలని రైతులు, నీటి సంఘాలు కోరుతున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయింది. చేల నుంచి మురుగునీటి కాలువల్లోకి నీరు దిగడం కూడా చేలు ఎండిపోవడానికి కారణమవుతోంది.

రైతుల నిరసన



అల్లవరం మండలం దేవగుప్తంలో నీరు లేక నెర్రెలు తీసిన వరిచేలు

అల్లవరం మండలం గుండెపూడి ప్రధాన పంట కాలువపై నీటి ఎద్దడి అధికంగా ఉంది. వంతుల వారీ విధానం పేరుతో మూడు వారాలుగా కాలువకు నీరు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సుమారు 300 ఎకరాలకు నీరందక పంట చేలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేక రైతులు ఎండిన చేలల్లో వరి దుబ్బులు పట్టుకుని మంగళవారం నిరసనకు దిగారు.

36 గంటలే వంతు ఇచ్చారు



మూడు వారాల నుంచి నీరందడం లేదు. అంతర్వేది ఉత్సవాల అనంతరం మా కాలువలకు పూర్తి స్థాయిలో నీరు ఇస్తారని ఆశించాం. వంతుల విధానంలో కేవలం 36 గంటలు మాత్రమే నీరందించారు. దీంతో చుక్క నీరు కూడా చేలల్లో పారలేదు. 1.5 ఎకరాలు సొంత భూమి, 7 ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నాను. మొత్తం వ్యవసాయమంతా నీటి ఎద్దడి ఉంది. కాలువపై లస్కర్ ఎవరో కూడా తెలియడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు.

– బొంతు నాగేశ్వరరావు, దేవగుప్తం, అల్లవరం మండలం

పలుచోట్ల ఎండుతున్న చేలు

కాట్రేనికోన మండలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బొబ్బర్లంక - పల్లంకుర్రు ప్రధాన పంట కాలువ శివారులోనే నీరు లేక ఎండిపోతోంది. కాలువ పరిస్థితి ఇలా ఉంటే పంట చేల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, వేట్లపాలెం, సత్తెమ్మచెట్టు, దొంతికుర్రు, సత్తెమ్మచెట్టు, కొప్పిగుంట, పల్లంకుర్రు వంటి ప్రాంతాల్లో సాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో లేదు. పలుచోట్ల చేలు ఎండిపోతున్నాయి. పరిస్థితి దారుణంగా మారడంతో సాగునీటి సంఘాల ప్రతినిధులు ఇప్పుడు జేసీబీ తెచ్చి కాలువల్లో పూడిక తొలగిస్తున్నట్టు హడావుడి చేస్తున్నారు.



కాట్రేనికోన మండలం పల్లంకుర్రు 2 లాకు పరిధిలో ఎండిపోతున్న వరిచేలు



కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరంలో ఎండిపోతున్న వరిచేలు

మొత్తం పంట దెబ్బతినే ప్రమాదం

ఇది ఐ.పోలవరం మండలం జి.వేమవరం శివారు ప్రాంతం. వరి చేలకు నీరందక ఇలా బీటలు వారిపోతోంది. వెదజల్లు పద్ధతిలో సాగు చేసిన చేలకు సకాలంలో నీరందక మొత్తం పంట దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. జి.వేమవరంతోపాటు గుత్తెనదీవిలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఐ.పోలవరం ప్రధాన పంట కాలువ, ఎదుర్లంక కాలువ ద్వారా నీరందాల్సి ఉంది. కాలువలు అధ్వానంగా ఉండడంతోపాటు వంతుల వారీ విధానం అమలు లోపభూయిష్టంగా ఉండడంతో చేలకు నీరందడం లేదు.

తొలి నుంచీ ఇదే పరిస్థితి



రబీ మొదలు పెట్టినప్పటి నుంచి మా ఆయకట్టుకు నీరందించడం లేదు. మా పది ఎకరాలతోపాటు చుట్టుపక్కల ఆయకట్టు అంతా ఎండిపోయేలా ఉంది. అధికారులకు చెబుతున్నా ఫలితం లేదు. పంట కాలువ మొత్తం తూడు, గుర్రపుడెక్కతో ఉంది. మా చేలకు సరిపడా నీరు రావడం లేదు.

– నల్లా మోహనరావు, జి.వేమవరం, ఐ.పోలవరం మండలం

న్యూస్‌రీల్

సీసీ కెమెరాలతో శివాలయాల్లో నిఘా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీసీ రమేష్‌బాబు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఈ నెల 26న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా శివాలయాల్లో సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఈవోలను దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) డీఎల్‌వీ రమేష్‌బాబు ఆదేశించారు. జిల్లాలోని శివాలయాల ఈవోలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే దర్శనాలు ఏర్పాటు చేయాలన్నారు. పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, సామర్లకోట కుమారారామ భీమేశ్వరస్వామి, కాకినాడ రామారావుపేట విశ్వేశ్వరస్వామి దేవస్థానాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నామని చెప్పారు. ఆయా శివాలయాల్లో ఉన్న సిబ్బందితో పాటు వేరే ఆలయాల్లో పని చేస్తున్న సిబ్బందిని డెప్యూటేషన్‌పై నియమించుకోవాలని సూచించారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా వారం రోజుల ముందే క్యూ, బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్యూలోని భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయాలని, కాళ్లు కాలకుండా మ్యాట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూ లైన్ రోడ్డు బయటకు ఉంటే టెంట్లు కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు పాలు పంపిణీ చేయాలన్నారు. భక్తుల రద్దీ ఉండే ఆలయాల్లో జల్లు స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలన్నారు. హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసరమైతే భక్తులకు వైద్య సహాయం అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఆలయంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని రమేష్‌బాబు పేర్కొన్నారు.

అన్నవరం దేవస్థానంలో వాట్సాప్ సేవలు

95523 00009 నంబర్‌తో ప్రారంభం

అన్నవరం: వాట్సాప్ ద్వారా సత్యదేవుని సన్నిధిలో వివిధ సేవల టిక్కెట్ల విక్రయాలు, విరాళాల స్వీకరణ తదితర సేవలకు వీలు కల్పించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు మంగళవారం ఈ విషయం తెలిపారు. వాట్సాప్ నంబర్ 95523 00009కు హాయ్ అని ఇంగ్లిషులో మెసేజ్ పెడితే వివిధ సేవలు ఓపెన్ అవుతాయి. వాటిలో టెంపుల్ బుకింగ్ సర్వీసెస్‌ను ఎంచుకోవాలి. అందులో వివిధ దేవస్థానాలు ఓపెన్ అవుతాయి. వాటిలో అన్నవరం దేవస్థానం ఎంచుకోవాలి. అందులో టెంపుల్ దర్శనం, టెంపుల్ సేవ, టెంపుల్ డొనేషన్ ఆప్షన్లు వస్తాయి. వాటిలో అవసరమైన దానిని ఎంపిక చేసుకోవాలి. ఉదాహరణకు టెంపుల్ సేవలో వ్రతం ఎంచుకుని నిర్దేశిత మొత్తాన్ని డిజిటల్ పద్ధతిలో చెల్లించి రశీదు పొందాలి. దానిని ప్రింట్ తీసుకుని దేవస్థానం వ్రతాల విభాగంలో చూపిస్తే వెంటనే వ్రతానికి అనుమతిస్తారు. దర్శనం, ప్రసాదం, ఇతర సేవలకు కూడా ఇదే విధానం వర్తిస్తుందని ఈఓ తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- శివారు మండలాలపై దృష్టి పెట్టాలి
- పీబీసీ, ఏలేరులో వంతుల వారీ విధానం
- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: వేసవిలో జిల్లా వ్యాప్తంగా తాగు, సాగు నీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని వివిధ మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతూ, ప్రస్తుత తాగు, సాగునీటి లభ్యత, అవసరాలు తెలుసుకున్నారు. గోదావరి డెల్టా, ఏలేశ్వరం ఆయకట్టు కింద పంటల సాగు వివరాలు, సాగునీటి అవసరం, ప్రస్తుత నీటి నిల్వలపై చర్చించారు. తాగు, సాగు నీటి సమస్యలపై కింది స్థాయి అధికారులు, సిబ్బందితో జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదించి, నిర్దిష్ట సమాచారం సేకరించాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, సాగునీటి చెరువులను నీటితో నింపాలన్నారు. తాళ్లరేవు, కరప, పెదపూడి, కాజులూరు, ఇతర శివారు మండలాల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, సాగునీటి సంఘాల నాయకులకు, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) కింద 32,500, ఏలేరు రిజర్వాయర్ కింద 53,017 ఎకరాలకు ఈ నెల 15 నుంచి వంతుల వారీగా సాగునీటి విడుదలకు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి రైతుకూ యూనిక్ ఐడీ

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేసే ఉద్దేశంతో ఆధార్ కార్డు తరహాలో రైతులకు ప్రభుత్వం 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) అందించనున్నదని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతుతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, వివిధ రాయితీలు పొందాలంటే రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరని పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రీ ప్రక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, ఇరిగేషన్ ఎస్‌ఈ కె.గోపీనాథ్, ఈఈ జి.శేషగిరిరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా సొమ్ము కాజేశారు

- జనసేన నాయకుడిపై అనాథ పిల్లల ఆరోపణ
- న్యాయం చేయాలని విన్నపం
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్



కరప: గార్డియన్‌గా ఉంటూ.. తమ తల్లి మృతి చెందగా వచ్చిన బీమా సొమ్ము, తమ తాత సొమ్ము, అమ్మ ఒడి సొమ్ము కలిపి రూ.3 లక్షలు ఓ వ్యక్తి కాజేశాడని, తమకు న్యాయం చేయాలని అనాథ పిల్లలు కోరుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంబంధిత వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అనాథ పిల్లల కథనం ప్రకారం.. కరప మండలం గొడ్డటిపాలేనికి చెందిన తోట నాగేశ్వరరావు, లోవలక్ష్మి దంపతులకు చక్రమ్మ, లక్ష్మి కుమార్తెలు. 2015లో నాగేశ్వరరావు, 2017లో లోవలక్ష్మి అనారోగ్యంతో మరణించారు. దీంతో పిల్లలిద్దరూ తాత తోట నరసింహులు వద్ద ఉండేవారు. 2020లో నరసింహులు కూడా మరణించడంతో అక్కచెల్లెళ్లు చక్రమ్మ, లక్ష్మి అదే గ్రామంలోని అనాథాశ్రమంలో చేరారు. కొంత కాలం క్రితం పెదపూడి మండలం పెద్దాడ గ్రామానికి ఈ అనాథాశ్రమాన్ని తరలించారు. అక్కడే ఉంటూ చక్రమ్మ, లక్ష్మి చదువుకుంటున్నారు. చిన్నతనంలో తల్లి మరణించడంతో చంద్రన్న బీమా పథకంలో వారికి రూ.1.90 లక్షలు వచ్చాయి. ఆ పిల్లలకు గొడ్డటిపాలేనికి చెందిన వీరంరెడ్డి ముత్యాలరావు (జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు) గార్డియన్‌గా ఉండేవాడు. అతడు తాతను ఒప్పించి, పిల్లలకు వచ్చిన బీమా సొమ్మును అరట్లకట్టలోని కార్పొరేషన్ బ్యాంక్‌లో చక్రమ్మ పేరిట ఖాతా తెరచి, జమ చేశారు. బ్యాంక్ పుస్తకం, చెక్‌బుక్ తనవద్దే ఉంచుకున్నాడు. తాత నరసింహులు మరణానంతరం పిల్లల సంరక్షణ చూసుకుంటానని గ్రామంలో చెప్పి, తమ కోసం తాత దాచిన రూ.50 వేలు ముత్యాలరావు తీసుకున్నాడని, చాలాసార్లు తమ స్కూలుకు వచ్చి చెక్కులపై సంతకాలు చేయించుకుని, బీమా సొమ్ము కాజేశాడని చక్రమ్మ, లక్ష్మి ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వచ్చిన అమ్మ ఒడి పథకం సొమ్ము కూడా ముత్యాలరావు తన కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలో జమ చేయించుకున్నారని పేర్కొన్నారు. ఇటీవల తన చెల్లెలి పుట్టిన రోజు కేక్ కొనడానికి ముత్యాలరావును డబ్బులు అడిగితే ఇవ్వకపోగా, దుర్భాషలాడి పంపించేశాడని చక్రమ్మ తెలిపింది. గొడ్డటిపాలెంలో తమ చిన్నపాటి ఇంటిని కూడా ముత్యాలరావు ఎవరికో అద్దెకిచ్చి, ఆ డబ్బులు కూడా తమకు ఇవ్వడం లేదని బాలికలు ఆరోపించారు. తమకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే పంతం నానాజీ, గ్రామస్తులు న్యాయం చేయాలని చక్రమ్మ, లక్ష్మి కోరుతున్నారు.

ఆరోపణలు అవాస్తవం

తాను రూ.3 లక్షలు కాజేసినట్లు చక్రమ్మ, లక్ష్మి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ముత్యాలరావు చెప్పారు. పిల్లల కోసం, వారి తల్లిదండ్రులు, తాత దహన సంస్కారాలకు, ఆసుపత్రికి చేసిన ఖర్చుల వివరాలన్నీ తనవద్ద ఉన్నాయని, ఎవరు వచ్చినా లెక్కలు చెబుతానని అన్నారు. తన తండ్రి లోవలక్ష్మిని ఆదరించి, నాగేశ్వరరావు కాళ్లు కడిగి కన్యాదానం చేశారన్నారు. పిల్లల తల్లిదండ్రులు, తాత చనిపోయినప్పుడు గ్రామస్తులెవరూ రాకపోయినా తానే దహన సంస్కారాలు చేశానన్నారు. పిల్లలు కూడా తనను పెదనాన్న అంటూ ఆత్మీయంగా ఉండేవారన్నారు. గ్రామంలోని ముగ్గురు వ్యక్తులు తనకు వస్తున్న పేరు చూడలేక పిల్లలకు లేనిపోనివి నూరిపోసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ముత్యాలరావు చెప్పారు. చక్రమ్మ చదువుకోవడం లేదని, ఒక పాస్టరమ్మ వద్ద ఉంటున్నట్టు తెలిసిందని అన్నారు. ఎప్పటికైనా పిల్లలు తమ తప్పు తెలుసుకుని వస్తే ఆదరిస్తానని అన్నారు.

11 నామినేషన్ల తిరస్కరణ

ఏలూరు (మెట్రో): తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 11 మంది అభ్యర్థుల నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. మరో 43 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించారు. ఏలూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి నామినేషన్లను మంగళవారం పరిశీలించారు. ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత ఈ ప్రక్రియను పరిశీలించారు. స్వతంత్ర అభ్యర్థులు రాయుడు శ్రీనివాసు, శెట్టిబత్తుల రాజబాబు, భావన ధాన్యలక్ష్మి, కొండపల్లి శ్రీనివాసు, మహ్మద్ ఆలీ జామ్‌షీద్, డీకేవీ ప్రకాష్, కొరుసు రాజకీర్తి, మెర్ల శ్రీవాణి, జీవదేవ దయాకర్, నేషనల్ నవక్రాంతి పార్టీకి చెందిన పాదముత్యం ప్రతాప్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా బీఆర్ అంబేడ్కర్ పార్టీకి చెందిన నీతిపూడి రామకృష్ణ నామినేషన్ పత్రాలు సక్రమంగా లేవని తిరస్కరించారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



నరేంద్రకుమార్, గంగరాజులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: రాజస్థాన్ రాష్ట్రం అల్వార్‌లోని యువరాణి అథ్లెటిక్స్ సమితి ప్రాంగణంలో ఈ నెల 6,7,8 తేదీల్లో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో అమలాపురానికి చెందిన ఇద్దరు మాస్టర్ క్రీడాకారులు పతకాలు పట్టి విజేతలయ్యారు. జాతీయ పోటీల్లో సత్తా చాటిన వారు అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు. 30 ప్లస్ విభాగంలో రెడ్డి నరేంద్రకుయార్ మొత్తం నాలుగు విభాగాల రన్నింగ్‌ల్లో విజేతగా నిలిచాడు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి కుమారుడైన నరేంద్రకుమార్ ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3 కే రన్‌లో ప్రథమ స్థానం సాధించిన సంగతి తెలిసిందే. ఇదే అథ్లెటిక్స్ పోటీల్లో అమలాపురానికి చెందిన జి.గంగరాజు 60 + సంవత్సరాల విభాగంలో 5 కిలోమీటర్ల వాకింగ్‌లో తృతీయ స్థానాన్ని సాధించి కాంస్య పతకాన్ని అందుకున్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన నరేంద్రకుమార్, గంగరాజు అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు. వీరు త్వరలో థాయ్‌లాండ్ లేదా సింగపూర్‌లో జరిగి ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో తలపడనున్నారు. తాను ఇన్ని పతకాలు సాధించడానికి డీఎస్‌డీవో పి.సురేష్‌కుమార్, కోచ్‌లు ఇళ్ల సురేష్‌కుమార్, కొప్పిశెట్టి వెంకట్రావు, ఐ.భీమేష్, వై.ఉదయ్ కిరణ్‌ల సూచనలు, సలహాలే కారణమని అథ్లెటిక్ నరేంద్రకుమార్ తెలిపారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో మంగళవారం వీరిద్దరినీ సత్కరించారు.

రత్నగిరిపై భక్తుల సందడి



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. సత్యదేవుని సుమారు 25 వేల మంది దర్శించుకుని, పూజలు చేశారు. ఉచిత దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు గోశాలలో సప్తగోవులను దర్శించి, పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. సత్యదేవుని వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్న ప్రసాదాన్ని 4 వేల మంది స్వీకరించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం కూడా రత్నగిరిపై తీవ్ర రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. గత శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా దేవస్థానంలోని వివిధ ప్రాంతాల్లో వేసిన షామియానాలను, చేసిన ఏర్పాట్లను మాఘ పౌర్ణమి రద్దీని దృష్టిలో ఉంచుకుని అలాగే ఉంచారు. పౌర్ణమి సందర్భంగా వనదేవత వనదుర్గ అమ్మవారికి బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు.



కేంద్రం చేతికే పెత్తనం!

- ఆ దిశగా యూజీసీ ముసాయిదా నిబంధనలు
- ఆమోదిస్తే వీసీల నియామకాధికారం గవర్నర్ల చేతుల్లోకి..
- తాజా ప్రతిపాదనలపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనల ముసాయిదా, రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను లాక్కునేలా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివలన విశ్వవిద్యాలయాలు స్వయంప్రతిపత్తి కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల్లోకి విద్యారంగం వెళ్లిపోయే పరిస్థితులను కేంద్రం కల్పిస్తోందని విమర్శిస్తున్నాయి. రాష్ట్రంలో 17 యూనివర్సిటీలు ఉన్నాయి. గతంలో గవర్నర్‌తో పాటు వర్సిటీల్లో వీసీ, వివిధ సభ్యుల కమిటీ ఉండేది. వీసీ నియామకంపై తుది నిర్ణయం రాష్ట్రానికే ఉండేది. ఇక నుంచి చాన్సలర్ హోదాలో వీసీలను నియమించే అధికారాన్ని గవర్నర్‌కు అప్పగించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై అభిప్రాయ సేకరణ చేపట్టింది. అనంతరం గవర్నర్ల ద్వారానే వీసీల నియామకాలు చేపట్టనుంది. తద్వారా వర్సిటీలపై పెత్తనం కేంద్రం చేతిలోకి వెళ్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమించక తప్పదని విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలను మూసివేసే ఉద్దేశంతోనే యూజీసీ ద్వారా కేంద్రం కొత్త నిబంధనలకు తెర తీసిందని వారు ఆరోపిస్తున్నారు. ఉన్నత విద్యను మరింతగా కార్పొరేటీకరించడంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. యూజీసీ నిబంధనల పేరిట రాష్ట్రాల హక్కులను కేంద్రం కాలరాస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

విద్యార్థులు ఉద్యమించాలి



దేశంలోని విశ్వవిద్యాలయాల నియంత్రణ అంశం కార్పొరేట్ శక్తులకు లాభదాయక సాధనంగా మారనుంది. అలా మారక ముందే విద్యార్థులు ఉద్యమ బాట పట్టాలి. ఉన్నత విద్యారంగాన్ని కాపాడుకోవాలంటే యూజీసీ ముసాయిదాను విద్యావేత్తలు, విద్యార్థులు తిరస్కరించాలి.

– పి.రవితేజ, స్టూడెంట్ జేఏసీ కన్వీనర్

రాజ్యాంగంపై యూజీసీ దాడి



తమ విద్యా హక్కులను తామే వినియోగించుకుంటామని పలు రాష్ట్రాలు చెబుతున్నాయి. యూజీసీ ముసాయిదా పేరిట తీసుకుంటున్న చర్యలు పరిపాలనాపరమైన సమస్య కాదని కేంద్రం చెబుతోంది. మరోవైపు యూజీసీ ద్వారా రాజ్యాంగంపై దాడి చేసేందుకు వెనుకాడటం లేదు. – కె.లలిత్ కుమార్, రాష్ట్ర విద్యార్థి పరిషత్ స్టూడెంట్ డెవలప్‌మెంట్ కన్వీనర్

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

గుర్తు తెలియని మహిళ మృతదేహం స్వాధీనం

రావులపాలెం: స్థానిక గౌతమి గోదావరి పాత బ్రిడ్జి కింద నీటిలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై చంటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సుమారు ఐదు అడుగుల 4 అంగుళాల పొడవు, 6 అంగుళాల జుట్టు, నీలిరంగు చీర, జాకెట్, చర్మం పూర్తిగా ఊడిపోయిందని, ప్రమాదవశాత్తూ నదిలో జారిపడి ఇక్కడ వరకు కొట్టుకు వచ్చినట్టు భావిస్తున్నారు. మృతదేహం వివరాలు తెలిసినవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ శేఖర్‌బాబు కోరారు.

చోరీకి గురైన మొబైల్ ఫోన్ల అప్పగింత

రాజమహేంద్రవరం సిటీ: దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ద్వారా గుర్తించి వాటిని స్వాధీన పరుచుకుని రూ.1,80,000 విలువైన ఏడు మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసినట్లు రాజమహేంద్రవరం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్టేషన్ ఆవరణలో మొబైల్ ఫోన్లను అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ రూ.5.50,000 విలువైన 47 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీ ఎస్‌ఐ మావుళ్లు, లోవరాజు పాల్గొన్నారు.

అలరించిన చోర సంవాదం

- రాజాధిరాజ, అశ్వవాహనాలపై గ్రామోత్సవాలు



రాజాధిరాజ వాహనంపై గ్రామోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థ మహోత్సవాల్లో ఎనిమిదవ రోజు మంగళవారం సాయంత్రం 4 గంటలకు రాజాధిరాజ వాహనంపైన, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపైన గ్రామోత్సవాలు అర్చకులు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు 16 స్తంభాల మండపం వద్ద అర్చకులు నిర్వహించిన చోర సంవాద ఘట్టం భక్తులను ఎంతగానో అలరించింది. దారి దోపిడీ దొంగగా మారిన పరకాలుడును, లక్ష్మీనృసింహ స్వామి తిరుమంగయాళ్వార్‌గా మార్చి, మంచి జీవితాన్ని ప్రసాదించిన ఘట్టాన్ని ఇతి వృత్తంగా చేసుకుని అర్చకులు నిర్వహించేది చోర సంవాదం ఘట్టం. కల్యాణోత్సవాల్లో ఏటా మాదిరే ఎనిమిదవ రోజు మంగళవారం గ్రామంలోని 16 స్తంభాల మండపం వద్ద రాత్రి 8 గంటలకు నిర్వహించిన పై ఘట్టం భక్తులను అలరించింది. ప్రేమించిన యువతిని పెళ్లాడేందుకు తిరుమంగయాళ్వార్(పరకాలుడు)దారి దోపిడీ దొంగగా మారడం, స్వామి సాక్షాత్కరించి అతడిలో పరివర్తన తేవడాన్ని కళ్లకు కట్టిస్తూ సాగేదే చోర సంవాదం ఘట్టం. పూర్వం పరకాలుడనే ధనికుడు ఒక యువతిని పెళ్లి చేసుకోవాలని వెంటపడతాడు. అన్నదానం చేస్తేనే వివాహ మాడతానని ఆమె షరతు విధించడంతో ఆస్తి మొత్తాన్ని అన్నదానానికి వినియోగిస్తాడు. క్రమంగా ఆస్తి అంతా హరించి పోవడంతో చేసేది లేక దారి కాచి ప్రజలను దోపిడీ చేసి, ఆ డబ్బుతో అన్నదానం చేస్తాడు. దొంగ బారి నుంచి రక్షించమన్న ప్రజల ప్రార్థనలతో విష్ణుమూర్తి, రాజు వేషంలో దొంగవద్దకు వచ్చి దోపిడీ చేసిన సొమ్ముతో ఈ అన్నదానం చేస్తే ఫలితం దక్కదని హితబోధ చేస్తారు. అయినా దొంగ స్వామివారిని బెదిరించడంతో వంటిపై నున్న ఆభరణాలను ఇచ్చి, నిజ స్వరూపంతో సాక్షాత్కరిస్తారు. పరకాలుడిని తిరుమంగయాళ్వార్‌గా మార్చి, మంచి జీవితాన్ని స్వామి ప్రసాదిస్తారు.

అశ్వవాహనం

మనిషిలో ఉండే జ్ఞానం అశ్వం మాదిరిగా చురుకుగా ఉండాలని సూచించేందుకు స్వామి ఉత్సవాల్లో ఈ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.



అశ్వవాహనంపై గ్రామోత్సవం

రాజాధిరాజ వాహనం

రాజులకే రాజైన లక్ష్మీనరసింహస్వామి భక్తుల కోర్కెలు తీర్చడానికి ఈ వాహనాన్ని అధిరోహించి గ్రామోత్సవానికి వెళతారు.

ఘనంగా గ్రామోత్సవాలు

ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు రాజాధిరాజ వాహనంపైన, అశ్వవాహనంపైన శ్రీస్వామివారి గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయం నుంచి పల్లకీలో స్వామి, అమ్మవార్లను అలంకార మండపానికి అర్చకులు, భక్తులు తోడ్కొని వచ్చారు. అలంకార మండపంలో పూలతో స్వామిని అలంకరించారు. వాహనాల వద్ద ప్రముఖులు, అర్చకులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మాఢ వీధుల్లో వాహనాలపై స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అరటి పండ్లు, కొబ్బరికాయలు సమర్పించుకున్నారు.

అంతర్వేదిలో నేడు

ఉత్సవాల్లో భాగంగా బుధవారం తొమ్మిదవ రోజు మాఘ పౌర్ణమి సందర్భంగా స్వామివారి చక్రవారి అవభృథోత్సవం, సముద్రస్నానం నిర్వహిస్తున్నట్టు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ అన్నారు. ఉదయం 3 నుంచి 6 గంటల వరకూ సుప్రభాతసేవ, శ్రీస్వామివారి తిరువారాధన, బాలభోగం, వార్షిక అభిషేకాలు, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు ఉంటాయన్నారు. ఉదయం 8 గంటలకు గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, రాత్రి ధ్వజ అవరోహణ నిర్వహిస్తామన్నారు.

ఆత్మహత్యను నివారించిన పోలీసులకు ఎస్పీ అభినందన

అమలాపురం టౌన్/అన్నవరం/అయినవిల్లి: సకాలంలో స్పందించి కేవలం 6 నిమిషాల వ్యవధిలో ఆత్యహత్య ప్రయత్నం చేసుకుంటున్న వ్యక్తిని కాపాడిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం మంగళవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. అయినవిల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో చనిపోదామని నిర్ణయించుకుని తన బంధువులకు సెల్ఫీ వీడియో తీసి పంపిచడమే కాకుండా ఆ వెంటనే ఆత్మహత్యకు సిద్ధమయ్యాడు. అతని బంధువుల నుంచి సోమవారం రాత్రి 11.21 గంటలకు సమాచారం అందుకున్న పి.గన్నవరం సీఐ భీమరాజు తక్షణమే స్పందించి జిల్లా ఐటీ కోర్ సిబ్బంది జాఫర్‌ను అప్రమత్తం చేశారు. బాధితుని సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా అతడు కాకినాడ జిల్లా అన్నవరంలో ఉన్నట్టు తెలుసుకున్నారు. తక్షణమే ఐటీ కోర్ ఈ సెల్ఫీ వీడియోను అన్నవరం ఎస్సై శ్రీహరికి పంపించారు. ఓ లాడ్జిలో బాధితుడు గది తలుపులు వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే పోలీసులు ఆ లాడ్జిని గుర్తించి అక్కడకు క్షణాల్లో వెళ్లి తలుపులు పగులగొట్టి అతడిని కాపాడారు. ఈ పరిణామాలన్నీ రాత్రి 11.21 గంటల నుంచి 11.27 గంటల వరకూ కేవలం 6 నిమిషాల వ్యవధిలో జరగడం, పోలీసులు వేగంగా స్పందించి ఆత్మహత్యను నిరోధించడంపై ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికావడం తథ్యం



ముద్రగడ పద్మనాభం, గిరిబాబుతో మాట్లాడుతున్న గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

- కుట్రకోణంపై దర్యాప్తు చేయాలి
- ముద్రగడ కుటుంబానికి సంఘీభావం తెలిపిన రాజమహేంద్రవరం వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం ఇదే తరహాదాడులకు పాల్పడితే ప్రజల ఆగ్రహానికి గురికావడం తథ్యం అని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు హెచ్చరించారు. మంగళవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే, రుణ మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం వాకింగ్ చేసే సమయాన్ని గుర్తించుకుని ఏదో చేద్దామనే ఉద్దేశంతో దాడి చేశారన్నారు. ఆయనకు అనారోగ్యం కారణంగా ఆ నాలుగు రోజులు వాకింగ్‌కి రాకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారన్నారు. రాజకీయాల్లో సుదీర్ఘ కాలం ప్రజలకు సేవచేసిన వ్యక్తిపై ఇటువంటి దాడి జరిగితే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ సీపీయర్ నాయకులు ఇప్పటివరకు ఖండించకపోవడం దారుణం అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఈ దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్, చందన నాగేశ్వర్, తోట రామకృష్ణ, అన్నపూర్ణ రాజు, సర్పంచ్‌లు మట్టాశ్రీనివాస్, మల్లిపూడి వెంకటరావు, నాగమల్లేశ్వరరావు పలువురు మాజీ కార్పొరేటర్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పులకించిన పురవీధులు

- వైభవంగా కుంతీమాధవస్వామి రథోత్సవం
- తరలి వచ్చిన భక్తజనం



పిఠాపురంలో కుంతీమాధవస్వామి వారి రథోత్సవం



కుంతీమాధవస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన స్థానిక శ్రీకుంతీమాధవ స్వామివారి దివ్య రథోత్సవం మంగళవారం రాత్రి కనుల వైకుంఠంగా జరిగింది. ఉదయం పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహుద్దూర్ పేరున తొలి పూజ చేసిన అర్చకులు అధిక సంఖ్యలో విచ్చేసిన భక్త జనసందోహం నడుమ కుంతీమాధవస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చక్రవర్తుల నరసింహాచార్యులు, చక్రవర్తుల మాధవాచార్యులు యాజ్ఞికంలో వేదమంత్రాల నడుమ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. అనంతరం రాత్రి విచిత్ర వేషాలు, తప్పెటగుళ్లు, బ్యాండుమేళాల నడుమ విద్యుద్దీపాలు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై పట్టు వస్త్రాలు, నగలతో అలంకరించిన ఉత్సవ విగ్రహాలను వేద పండితులు రథంపై ఉంచి ఉత్సవాన్ని ప్రారంభించారు. ముందుగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజతో రథోత్సవాన్ని కొనసాగించగా స్వామివారి ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకు కొనసాగిన రథానికి అశేష భక్త జనవాహిని కదిలి వచ్చి స్వామివారి రథాన్ని లాగారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన రథయాత్ర తెల్లవారుజామున 2 గంటల వరకు కొనసాగింది. ఉప్పాడ సెంటర్లో బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అమితంగా ఆకట్టుకోగా ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీరాములు పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయం వద్ద నిర్వహించిన తీర్థం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాలతో పాటు కొనుగోలు దారులతో కళకళలాడింది. రథోత్సవం అనంతరం స్వామివారిని ప్రత్యేక రథంపై ఉప్పాడ సముద్ర తీరానికి చక్రస్నానం కోసం తీసుకెళతారు.

నేడు ఉప్పాడ తీర్థానికి దొంగ దేవుడు

బుధవారం తెల్లవారుజామున దొంగ దేవుడు తీరానికి చేరుకోగానే ఉప్పాడ తీరంలో భక్తులు మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు ఆచరించనున్నారు. పిఠాపురంలో ముందురోజు రాత్రి రథోత్సవం అనంతరం తెల్లవారుజామున చీకటిలో భక్తులు పోలీసుల పహరా నడుమ కుంతీమాధవ స్వామి ఊరేగింపుగా ఉప్పాడ తీరానికి చేరుకుంటారు. ముందుగా స్వామివారి చక్రస్నానం చేయించిన అనంతరం భక్తుల పుణ్య స్నానాలు ప్రారంభమవుతాయి. అర్ధరాత్రి చీకటిలో తీసుకురావడం వల్ల దొంగతనంగా ఎవరికీ కనిపించకుండా అందరు నిద్రావస్థలో ఉండగా వస్తారు కాబట్టి శ్రీకుంతీమాధవ స్వామి వారికి దొంగ దేవుడిగా పేరు ఉంది. భక్తుల పుణ్య స్నానాల అనంతరం తిరిగి సాయంత్రం స్వామివారిని రథంపై ఆలయానికి ఊరేగింపుగా తీసుకురావడం ఆనవాయితీ. అయితే గతంలో రథం ఉప్పాడ వరకు తీసుకెళ్లడం కష్టతరం కావడంతో ప్రస్తుతం పెద్ద రథం నుంచి స్వామివారిని చిన్న రథంపైకి మార్చి ఉప్పాడ ఊరేగింపుగా తీసుకువస్తున్నారు. దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో పాటు దగ్గరుండి దేవుడిని ఆలయానికి సాగనంపుతారు. మిగతా ఆలయాల్లో దేవుళ్లకు ఆయా ఆలయాల్లో ఉన్న పుష్కరిణిల్లో చక్రస్నానం నిర్వహిస్తుంటారు కాని ఒక్క కుంతీ మాధవ స్వామి వారికి మాత్రమే ఎక్కడో దూరంగా ఉన్న ఉప్పాడ తీరంకు తీసుకువెళ్లి స్నానం చేయించడం పూర్వం నుంచి ఆచారంగా వస్తోంది. అది ఇప్పటికి కొనసాగుతోంది.

సీఎంఏలో జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్



కుమారుడితో ఆనందం పంచుకుంటున్న వాగ్దేవ్ తల్లిదండ్రులు

- మొదటిప్రయత్నంలోనే విజయం

రాజోలు: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) నిర్వహించిన కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్(సీఎంఏ) ఫైనల్ పరీక్షలో తాటిపాక గ్రామానికి చెందిన లక్కింశెట్టి వాగ్దేవ్ జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్ సాధించాడు. మంగళవారం ఐసీఎంఏఐ ఫలితాలను విడుదల చేసింది. ఈ మేరకు వాగ్దేవ్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అతని తండ్రి లక్కింశెట్టి సోమేశ్వరరావు వ్యాపారి. తల్లి లక్ష్మి గృహిణి. చిన్నతనం నుంచి తండ్రి నిర్వహిస్తున్న వ్యాపారాన్ని గమనించిన వాగ్దేవ్ వ్యాపార రంగంపై ఆసక్తి పెంచుకున్నాడు. దీంతో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్(సీఎంఏ) కోర్సులో గుంటూరులో శిక్షణ పొందాడు. జాతీయ స్థాయిలో జరిగిన సీఎంఏ ఫైనల్ పరీక్షలో 3,647 మంది ఉత్తీర్ణులు కాగా వాగ్దేవ్ రెండవ స్థానంలో నిలిచాడు. 2023లో నిర్వహించిన సీఎంఏ ఇంటర్ స్థాయి పరీక్షలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు.

కనుల పండువగా భీమేశ్వరస్వామి రథోత్సవం



ద్రాక్షారామ వీధుల్లో వైభవంగా శ్రీ భీమేశ్వరస్వామివారి రథోత్సవం రథంపై ఊరేగుతున్న కల్యాణ మూర్తులు (ఇన్‌సెట్)

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 4వ రోజు మంగళవారం అశేష భక్తజనంతో స్వామివార్ల కల్యాణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్ల కల్యాణమూర్తులను పుష్పాలతో అలంకరించిన రథంపై అధిష్ఠింపజేశారు. ధూపసేవ అనంతరం రథాంగబలి సమర్పించారు. సుమూహూర్త సమయానికి ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివార్ల కల్యాణమూర్తులతో రథం ఆలయం వద్ద నుంచి సూర్యావీధి గుండా వెలంపాలెం చేరుకుని చంద్రా వీధి మీదుగా ప్రధాన రహదారి పైకి, ఆ తర్వాత యానాం సెంటర్ మీదుగా ఆలయ పూజారులు, అర్చకస్వాములు, వేదపండితులు, అశేష భక్తజనులు వెంట రాగా వేగాయమ్మపేటలోని ఆస్థాన పూజా మండపం వరకు సాగింది. రథంలో ఆసీనులైన కల్యాణమూర్తులను దారి పొడవునా ప్రజలు కనులారా దర్శించుకుని భక్తితో కానుకలు సమర్పించుకున్నారు.

ప్రియుడి ఇంటి ముందు నిరసన

- న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ



ప్రియుడు ఇంటి ముందు ధర్నా చేస్తున్న యువతి

మామిడికుదురు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించి, ఇప్పుడు పెద్దలు పెళ్లికి అంగీకరించడం లేదంటూ మొహం చాటేసిన వ్యక్తితో తనకు పెళ్లి జరిపించాలని డిమాండ్ చేస్తూ యువతి ప్రియుడి ఇంటి ఎదుట నిరసన చేపట్టింది. ఈ ఘటన మంగళవారం పాశర్లపూడిబాడవ చింతలమెరకలో చోటు చేసుకుంది. కాట్రేనికోన మండలం చెయ్యేరు పండువారిపేటకు చెందిన గుంట్రు ప్రమీల (25) కాకినాడలో నర్సింగ్ చదువుతోంది. పాశర్లపూడిబాడవ చింతలమెరకకు చెందిన అంబాజీపేట ఎంఈఓ–2 మోకా ప్రకాష్ తనయుడు మోకా ప్రవర్ష తనను ప్రేమించాడని ప్రమీల పేర్కొంది. నాలుగేళ్ల నుంచి ఇద్దరం ప్రేమించుకున్నామని, తమ మధ్య ప్రేమ విషయం అతని ఇంట్లో అందరికీ తెలుసని చెప్పారు. ఇంట్లో పెద్దలను ఒప్పించి వివాహం చేసుకుంటానని తనను నమ్మించాడని యువతి వివరించారు. ఈ విషయంపై రెండు, మూడు పర్యాయాలు పెద్దల సమక్షంలో చర్చలు కూడా జరిగాయని పేర్కొన్నారు. రెండు నెలల నుంచి ప్రహర్ష తనకు అందుబాటులో లేకపోవడంతో గత నెల చివరి వారంలో కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ప్రవర్ష తండ్రి ఎంఈఓ మోకా ప్రకాష్ పోలీసుల సమక్షంలో పెళ్లికి అంగీకరించారన్నారు. ఈ ఒప్పందం జరిగిన తర్వాత మళ్లీ ప్రవర్షను కుటుంబ సభ్యులు కట్టడి చేశారని ఆమె ఆరోపించారు. తనకు అన్యాయం జరిగిందని, అతనితో తనకు పెళ్లి చేయాలని, లేదంటే తాను పెట్రోలు పోసుకుని అతని ఇంటి ఎదుటే ఆత్మహత్య చేసుకుంటానని ప్రమీల హెచ్చరించారు. ప్రహర్ష ఇంటి ఎదుట తన కుటుంబ సభ్యులు, మద్దతుదారులతో ఆందోళన చేపట్టారు. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ అక్కడకు చేరుకుని యువతికి, ఆమె కుటుంబ సభ్యులకు సర్ది చెప్పారు. యువకుడిపై ఫిర్యాదు చేయాలని సూచించారు. అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పెళ్లి విషయం పెద్దలతో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. ఈ దశలో ప్రమీల మద్దతుదారులు, ప్రహర్ష మద్దతుదారుల మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఎస్సై చైతన్యకుమార్ రెండు వర్గాలను సముదాయించారు. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు యువతి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పెద్దలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని, నిరసన విరమించాలని కోరారు. సుదీర్ఘ మంతనాల అనంతరం యువతితో పాటు ఆమె కుటుంబ సభ్యులు, మద్దతుదారులు నిరసనను విరమించి అక్కడి నుంచి వెళ్లి పోయారు.

18న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు, విధిగా హాజరుకావాలని కోరారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణం
- యువతి కుటుంబ సభ్యుల బెదిరింపులతో మనస్తాపం
- ఆరుగురిపై కేసు నమోదు



కొవ్వూరు మండలం వాడపల్లిలో ఉరి వేసుకుని మృతి చెందిన చిట్రా సూర్య (ఫైల్)

కొవ్వూరు: వాడపల్లి గ్రామానికి చెందిన చిట్రా సూర్య (20) అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని బలవర్మణానికి పాల్పడ్డాడు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సూర్యకు అదే గ్రామానికి చెందిన యువతితో ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఈ నెల 9వ తేదీన యువకుడు యువతి చదువుతున్న కొవ్వూరులోని స్కూలుకి వెళ్లాడు. యువతిని పిలువమని అడుగగా ప్రిన్సిపాల్ ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. తాము ఎవరినీ పంపలేదని చెప్పడంతో యువతిని కలిసేందుకు పాఠశాల నిర్వాహకులు నిరాకరించారు. యువతి పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ వ్యవహారంపై యువతి కుటుంబ సభ్యులు ఆ యువకుడి ఇంటికి వెళ్లి నిలదీశారు. స్థానిక బ్యాంకులో యువకుడి సోదరుడు పనిచేస్తున్నారు. ఆ యువకుడి బ్యాంకు ఉద్యోగం తీయించి వేస్తామని యువతి తల్లిదండ్రులు హెచ్చరించారు. పైగా సూర్యని చంపుతామని బెదిరించడంతో మనస్థాపం చెంది సోమవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో పక్క గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు యువకుడి తండ్రి శివ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు యువతి కుటుంబ సభ్యులైన హరి, వరలక్ష్మి, పార్వతీ, లాయర్ నరసింహరాజు, సూర్యచంద్రం, సత్యవతిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. సూర్య ఆ కుటుంబంలో రెండో సంతానం అన్నారు. ఒక అన్న, ఒక తమ్ముడు ఉన్నారని అన్నారు. మృతుడి తండ్రి తాపీ పనిచేస్తాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఆయన తెలిపారు.